
గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి

సమయానికి విధులకు రండి..!

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన సమయానికి విధులకు హాజరు కావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఉద్యోగులకు సూచించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె మరోసారి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని పలు సెక్షన్లను పరిశీలించిన ఆమె ఉద్యోగుల హాజరును పరిశీలించారు. ఏ సమయానికి వచ్చారని ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10.45 గంటల్లోపు హాజరు రిజిస్టర్‌లు తన చాంబర్‌కు వస్తాయని, అన్నీ పరిశీలిస్తున్నామని, సమయానికి రాని వారిపై చర్యలుంటాయని మేయర్ హెచ్చరించారు.


ఎస్పీఆర్‌హిల్స్‌లోని క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

క్రీడా మైదానంలో మరిన్ని సదుపాయాలు

● కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రెహ్మత్‌నగర్ ఎస్పీఆర్‌హిల్స్‌లోని క్రీడా మైదానంలో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి మైదానంలో వాకింగ్ చేశారు. మైదానం అభివృద్ధిపై వాకర్లతో చర్చించారు.


రోడ్డు భద్రత అంశంపై బేగంపేటలోని ఐడియా, వోడాఫోన్ సంస్థల ఉద్యోగులకు గురువారం బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు అవగాహన కల్పించారు
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

17న ప్రోగ్రెసివ్ బయోచార్ సొసైటీ జాతీయ సదస్సు

పంజాగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసివ్ బయోచార్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 17న యూసుఫ్‌గూడలోని నిమ్స్ మేలో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామని సొసైటీ చైర్మన్ ఆర్.కె.మెహతా తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సాయిభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి ఎస్.కె.గుప్తాతో ఆయన వివరాలు వెల్లడించారు. స్థిరమైన వ్యవసాయం, పర్యావరణ పునరుద్ధరణ కోసం తాము కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సొసైటీ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, పద్మారావు, శాస్త్రవేత్తలు మాధవీలత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

క్షత్రియ భవనానికి స్థలం కేటాయించాలి

పంజాగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు పేరుతో క్షత్రియ భవనం నిర్మాణానికి నగరంలో స్థలాన్ని కేటాయించాలని క్షత్రియ సేవా సమితి(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) అధ్యక్షుడు పేరిచర్ల నాగరాజు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి ఉపాధ్యక్షులు డాక్టర్ రఘురామరాజు, వి.వెంకటేశ్వర్‌రాజు, కోశాధికారి పి.వెంకటేశ్వర్‌రాజు తో కలిసి ఆయన మాట్లాడారు. అన్ని కులాలకు ఏర్పాటు చేస్తున్నట్లుగానే క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎంను కోరామన్నారు. ఈ నెల 18న గచ్చిబౌలి ఇండోర్‌స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డికి అభినందన సభ ఏర్పాటు చేశామని, ఈ సభకు పది వేల మందికి పైగా క్షత్రియులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సమితి నాయకులు భూపతిరాజు, రాజేంద్రరాజు, జి.మూర్తిరాజు, కలిదిండి రామకృష్ణరాజు, జగపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.


హర్ ఘర్ తిరంగా ప్రదర్శన నిర్వహించిన ఎన్‌సీసీ కేడెట్లు

ఎన్‌సీసీ కేడెట్ల తిరంగా మార్చ్

ఖైరతాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు సైఫాబాద్ పీజీ సైన్స్ కళాశాల ఎన్‌సిసి కెడెట్లు రూట్ మార్చ్ నిర్వహించి త్రివర్ణ పతాకాలను, ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఇంటింటికి తిరంగా జెండాపై అవగాహన కల్పించారు. బుధవారం ఎన్‌సిసి కెడెట్లు ఎసిగార్డ్స్‌లోని పిజి కళాశాల నుండి రూట్ మార్చ్ చేస్తూ పివి నర్సింహారావు మార్గానికి వచ్చారు. అనంతరం పివి విగ్రహం వద్ద వాహనదారులు, పాదచారులకు ఇంటింటికి మువ్వన్నెల జెండా ఎగురవేయాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ తిరంగా రూట్ మార్చ్‌ను 3 తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ శరత్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్, ఎన్‌సిసి అధికారి డాక్టర్ పల్నాటి నరేష్ అభినందించారు.

ఆస్ట్రేలియాకు పంపుతానని నకిలీ డాక్యుమెంట్‌లతో మోసం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాకు పంపుతానని నకిలీ డాక్యుమెంట్‌లతో మోసానికి పాల్పడిన కన్సల్టెన్సీ నిర్వాహకులపై ఓ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా నందిగామకు చెందిన కర్నాటి అనూష 4-6-2023లో వెంగళరావునగర్‌లోని ఆరోకే ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ మేనేజర్ అనుగుల మధుసూదన్‌ను కలిసింది. అతడు ఆస్ట్రేలియా పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. పనులు ప్రాసెస్ చేసేందుకని విడతల వారీగా డబ్బు పంపమన్నాడు. దీంతో పాటు కాలేజీ ఫీజు, ఇన్సూరెన్స్, ఫ్లైట్ టిక్కెట్ అంటూ మొత్తం రూ.25 లక్షల వరకు అడగడంతో పలు దఫాలుగా ఆమె డబ్బు పంపింది. చివరగా ఆగస్టు 8వ తేదీన ఆస్ట్రేలియా వెళ్లొచ్చని ఆమెకు డాక్యుమెంట్‌లు అందించాడు. ఆ సర్టిఫికెట్‌లు, వీసాతో ఈ నెల 8వ తేదీన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లిన అనూషకు అక్కడి అధికారులు ఫేక్ డాక్యుమెంట్‌లని చెప్పారు. దీంతో బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద అడ్డంకుల తొలగింపు

సనత్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట నుంచి సనత్‌నగర్ మార్గంలో ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద నుంచి ఫ్రీ లెఫ్ట్ తీసుకునే వాహనదారులకు అడ్డంకులను ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా ఫ్లైఓవర్ కింద ఆక్రమణలను తొలగించే పనులు బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో చురుగ్గా సాగుతున్నాయి. ఫ్లైఓవర్ కింద ఉన్న చర్చి నుంచి లోథాక్లబ్ హౌస్, సనత్‌నగర్ బస్టాండ్, ఫరాషా కేఫ్ ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలపై దృష్టి పెడుతున్నామని ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. బల్కంపేట నుంచి సనత్‌నగర్ వెళ్లే వాహనదారులు ఫ్లైఓవర్ పైనుంచి కాకుండా కింద ఉన్న లింక్ రోడ్డు ద్వారా వెళ్తారని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ కొంతమేరకు తగ్గుతుందన్నారు. రెండు రోజుల్లో ఆక్రమణలను పూర్తిగా తొలగించి వాహనదారులకు సహకరిస్తామని ట్రాఫిక్ సిబ్బంది తెలిపారు.


ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద అడ్డంకులను తొలగిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

గురుబ్రహ్మనగర్ ప్రహరీ కూల్చివేతపై విచారణ చేయాలి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు బస్తీవాసుల ఫిర్యాదు

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లోని గురుబ్రహ్మనగర్ ప్రహరీ కూల్చివేత ఘటనపై సమగ్ర విచారణ జరిపించి ఆదివాసీలకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు బస్తీవాసులు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు ఆధ్వర్యంలో బస్తీవాసులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. 30 సంవత్సరాలుగా తాము ఉంటున్న బస్తీలోకి రాకపోకలు సాగించకుండా అగ్రకులాల వారు అడ్డంగా గోడను నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించగా కులం పేరుతో దూషించారని తెలిపారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ తమపై అక్రమంగా కేసు నమోదు చేశారని ఆరోపించారు. తక్షణమే న్యాయం చేయాలని కోరారు. స్పందించిన వెంకయ్య మాట్లాడుతూ సమగ్ర విచారణ జరిపి నివేదికను సమర్పించాలని జీహెచ్‌ఎంసీ, నగర పోలీస్ కమిషనర్‌ను కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి గిరిజనులకు న్యాయం చేసేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


వెంకటయ్యకు ఫిర్యాదు చేస్తున్న నర్సింగరావు, గురుబ్రహ్మనగర్ వాసులు

18న గంగపుత్రుల ఆత్మీయసమ్మేళనం, భారీ శోభాయాత్ర


గంగ తెప్పోత్సవం పోస్టర్, ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న మెట్టు సాయితో మహేందర్‌బాబు తదితరులు

ఖైరతాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గంగ పుత్రుల ఆత్మీయ సమ్మేళనంతో పాటు భారీ శోభాయాత్రతో గంగ తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ చైర్మన్ మల్కు మహేందర్‌బాబు తెలిపారు. ఖైరతాబాద్ వాసవీకేంద్రంలో జరిగిన సమావేశంలో తెలంగాణ మత్స్యపారిశ్రామిక సహకార సొసైటీల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయితో కలిసి మహేందర్‌బాబు, తదితరులు గంగ తెప్పోత్సవ శోభాయాత్ర పోస్టర్‌ను, ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెట్టు సాయి మాట్లాడుతూ తెలంగాణలో గంగపుత్రులు సమైక్యత చాటేలా 5 లక్షల మందితో భారీ సమ్మేళనం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు, ప్రముఖులను ఆహ్వానించినట్లు తెలిపారు. మహేందర్‌బాబు మాట్లాడుతూ ప్రతియేటా శ్రావణమాసంలో నిర్వహించే గంగ తెప్పోత్సవంలో భాగంగా ఈనెల 18న ఉదయం 11 గంటలకు ఖైరతాబాద్ ఏడుగుళ్ల ఆలయం నుంచి హుస్సేన్‌సాగర్ గంగమ్మ ఆలయం వరకు 525 మంది మహిళలు బోనాలు, బెస్తల వల పందిళ్లు, పోతరాజుల విన్యాసాలు, వందలాది మంది కళాకారుల ప్రదర్శనలతో గంగతెప్ప మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. గంగపుత్రులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గంగ తెప్పోత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మంగళపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి పూస నర్సింహ, కోశాధికారి కాపరనేని లింగం, సలహాదారులు చంద్రశేఖర్, భైరు బాబురావు, గుండు జగదీష్, కొప్పు పద్మ, లలితాజగన్, పూస సత్యనారాయణ, శ్రీరాములు, రాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఖాజాగూడలో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు

రాయదుర్గం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి ఖాజాగూడ ఎక్స్‌రోడ్డులో హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (గ్రేటర్‌జోన్) మధుసూదన్, ఏటీఎం వెంకటనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆర్టీసీ కొరియర్, కార్గో, పార్శిల్ సేవల కోసం 96522 67204లో సంప్రదించాలని వారు సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది శ్రావణ్, ప్రదీప్, రమేష్ పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పంజాగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వడ్డెర సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని తెలంగాణ వడ్డెర హక్కుల సాధన కమిటీ సలహాదారు, న్యాయవాది వి.శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 35 సంవత్సరాల క్రితం వరకు సంచార జాతులు వడ్డెర, లంబాడీ, ఎరుకల, యానాది కులాలు బీసీ జాబితాలో ఉండగా, అప్పటి ప్రభుత్వం లంబాడీ, ఎరుకల, యానాది కులాలను ఎస్టీ జాబితాలోకి, వడ్డెరలను బీసీ-ఏ జాబితాలో చేర్చిందని తెలిపారు. దీంతో తమ సామాజికవర్గానికి అన్నిరంగాల్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో పలువురు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు ప్రాతినిధ్యం కల్పించాలి

పంజాగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా, అధ్యక్షుడు ఇందల్ రాథోడ్ డిమాండ్ చేశారు. లేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఇళ్లు ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ, రాష్ట్ర నూతన కార్యవర్గాలను వారు ప్రకటించారు. జాతీయ అధ్యక్షుడిగా ఇందల్ రాథోడ్, గౌరవాధ్యక్షుడిగా మోతిలాల్ నాయక్, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వెంకట్ బంజారా, ప్రధానకార్యదర్శిగా లోకేష్ నాయక్, కన్వీనర్‌గా రాజ్ కుమార్, ఉపాధ్యక్షులుగా మహేందర్ నాయక్, బాలాజీ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్త్యా రమేష్ నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డాన్ శ్రీనునాయక్, ఇన్‌చార్జీగా రోహిత్ నాయక్, ఉపాధ్యక్షులుగా వినోద్ నాయక్, లక్ష్మణ్ పవార్, ప్రధాన కార్యదర్శులుగా ప్రవీణ్ నాయక్, రవీందర్, భాస్కర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని, బంజారాలు మాట్లాడే గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా గుర్తించాలని, సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ బంజారా

క్రీడలతో శారీరక దృఢత్వం పెంపు


గెలుపొందిన క్రీడాకారులతో హబీబాసుల్తానా

బోరబండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచి, మానసిక ప్రశాంతత కలిగిస్తాయని డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హబీబాసుల్తానా అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సైట్-5 పీజేఆర్ క్రీడా మైదానంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడకారులకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎజాజ్‌బేగ్, నరసింహ, కాసుల మహేష్, హిదాయత్, చికోటి కవిత, అహ్మద్, ప్రసన్న, వాహేద్ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి ఆటో డ్రైవర్ మృతి

కవాడిగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి భవనంపై నుంచి పడి మృతిచెందాడు. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడ తాళ్లబస్తీలో సేరల రేణుబాబు(48) భార్య భాగ్య, ముగ్గురు కుమారులతో కలిసి నివసిస్తున్నాడు. రేణుబాబు ఆటో డ్రైవర్. అతడు మంగళవారం రాత్రి ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పాడు. భాగ్యకు అనుమానం వచ్చి కుమారుడు సాయిపవన్‌ను పంపించగా వారి ఇంటి ఎదుట ఉన్న అమర్ ఇంట్లో రేణుబాబు మరో ఐదుగురితో కలిసి మద్యం తాగుతున్నాడు. పవన్ విషయాన్ని తల్లికి చెప్పాడు. అర్ధరాత్రి 12.30 గంటల తర్వాత భవనం పై నుంచి ఓ వ్యక్తి కింద పడ్డాడని సమాచారం అందడంతో భాగ్య అక్కడికి వెళ్లి చూడగా రేణుబాబు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. వెంటనే 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని భాగ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్లలో చోరీలు చేస్తున్న ఇద్దరికి రిమాండ్

బర్కత్‌పుర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి రైళ్లలో చోరీలు చేస్తున్న ఇద్దరు దొంగలను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ కర్నూల్ జిల్లా, ఎమ్మిగనూరుకు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు మాచెర్ల తిమ్మప్ప(33), ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా మైలవరం బీసీ కాలనీకి చెందిన రామకృష్ణ కుమారుడు తుప్పలపూడి సాయిరాఘవ(34) స్నేహితులు. మాచెర్ల తిమ్మప్ప క్యాటరింగ్ కార్మికుడు. సాయిరాఘవ ఆటో డ్రైవర్. జల్సాల కోసం రైళ్లలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. బుధవారం కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఇద్దరూ నేరం అంగీకరించారు. వారి నుంచి పోలీసులు రూ. 90 వేల విలువ గల 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రైల్వేకోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

రోడ్డు కోసం దుండిగల్ తండావాసుల నిరసన

దుండిగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపల్‌లోని దుండిగల్ తండా-2కు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో తండావాసులు బుధవారం రోడ్డుపై నిరసన తెలిపారు. దీంతో కాజీపల్లి ఫార్మాసిటీకి వెళ్లాల్సిన బస్సులు, ఉద్యోగులు గంటల కొద్దీ ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు.


రోడ్డుపై నిలిచిన వాహనాలు

కాంగ్రెస్ కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

రాంనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో భాగంగా సమగ్ర కులగణన చేపట్టాలని కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో ఏఐసీసీ అధిష్ఠానం బుధవారం నిర్వహించిన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టిన బీసీలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన కోరారు. సమగ్ర కులగణన కోసం వారంరోజుల్లో అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల మేధావులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఆయిలి వెంకన్నగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, రాజేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

‘కాలేజీ యాజమాన్యం, లెక్చరర్స్‌పై దాడి తగదు’

దుండిగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దుండిగల్‌లోని ఎంఎల్ఆర్‌టీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మంగళవారం జరిగిన సీట్ల కేటాయింపు విషయంలో విద్యార్థి సంఘాల నాయకులు కాలేజీ యాజమాన్యం, లెక్చరర్లపై దాడి చేయడం తగదని తెలంగాణ ఇంజనీరింగ్ కాలేజెస్, టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యార్థి సంఘాల నాయకులు దాడులకు పాల్పడవద్దని, సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు.



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రంగురంగుల విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయం

మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి

● ఏసీపీ రమేష్



మండపాల నిర్వాహకులతో ఏసీపీ సమావేశం

తిరుమలగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల ద్వారా అనుమతి తీసుకోవాలని తిరుమలగిరి డివిజన్ ఏసీపీ రమేష్ సూచించారు. బుధవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో మండపాల నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండపంలో సేఫ్టీ ప్రీకాషన్స్ తీసుకోవాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండపంలో ఏర్పాటు చేయనున్న దీపం పడిపోకుండా గ్లాసును అమర్చాలన్నారు. దీంతో పాటు నీళ్ల, ఇసుక ఫైర్ ఎక్స్టింగ్యుషర్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తప్పకుండా ఎలక్ట్రిసిటీ విభాగం నుంచి అనుమతి తీసుకోవాలని చెప్పారు. వినాయకుడిని నిమజ్జనంకు తరలించే రూట్ మ్యాప్‌లో చెట్ల కొమ్మలు అడ్డంగా ఉంటే సదరు శాఖ నుంచి ట్రీ కటింగ్ చేయించాలన్నారు. పోలీస్ శాఖ నుంచి అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితిలో మండపం ఏర్పాటు చేయకూడదని, అలాగే మండపంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. సౌండ్ పొల్యూషన్ లేకుండా డీజేలను కంట్రోల్‌లో ఉంచాలని సూచించారు. విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయం రాత్రి 10గంటల వరకు ముగించాలని సూచించారు. ఊరేగింపులో మద్యం సేవించి పాల్గొనరాదని అన్నారు. ప్రశాంతంగా నవరాత్రి ఉత్సవాలు ఊరేగింపు జరుపుకొని పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఒకవేళ ఊరేగింపులో కాని, ఉత్సవాలలో కాని గొడవలు, ఘర్షణలు జరిగినట్లు అయితే చట్టపరంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. బోనాల వేడుకలలో గన్‌రాక్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఘర్షణపడితే వారిపై కేసులు నమోదుచేసి బైండోవర్ చేశామని, అలా జరగకుండా గణేష్ ఉత్సవాలలో కూడా ఆర్గనైజర్స్ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులను తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు

● నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మీపెరుమాళ్

మారేడుపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తన సెల్‌ఫోన్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసి పోలీసులనే బురిడీ కొట్టించిన వ్యక్తిని బేగంపేట పోలీసులు అరెస్టు చేసినట్లు ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీపెరుమాళ్ తెలిపారు. సెల్‌ఫోన్ దొంగతనం చేసిన నేపాల్ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బేగంపేట రసూల్‌పుర సమీపంలో అర్ధరాత్రి నలుగురు వ్యక్తులు వచ్చి తన సెల్‌ఫోన్ అపహరించారని బేగంపేట పోలీసులకు ఒక వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పది గంటల్లోనే నిందితులను పట్టుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. ఫిర్యాదుదారుడికి, నిందితులకు మధ్య 500 రూపాయల కోసం గొడవ జరిగిందని, ఫిర్యాదుదారుడే 500 రూపాయలు వారికి ఇవ్వాల్సి ఉన్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. సెల్‌ఫోన్ దొంగతనం కూడా జరగలేదని తెలియడంతో పోలీసులను తప్పుదోవపట్టించి నకిలీ ఫిర్యాదు ఇచ్చిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఉత్తర మండల డీసీపీ రష్మీపెరుమాళ్ తెలిపారు. బంగారు గొలుసు, సెల్‌ఫోన్ దొంగతనాల విషయంలో అప్రమత్తంగా ఉండే పోలీసులను తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరుగురు కబ్జాదారులపై కేసు నమోదు

మారేడుపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సృష్టించి, భూకబ్జాలకు పాల్పడుతున్న ముఠాపై కార్ఖానా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం నార్త్‌జోన్ కార్యాలయంలో డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏడబ్ల్యూహెచ్ కాలనీలో రిటైర్డ్ కల్నల్ కృష్ణారావుకు చెందిన 450 గజాల ఖాళీ స్థలాన్ని కొంతమంది ఆక్రమణదారులు (బ్రోకర్లు) పక్కా ప్రణాళిక ప్రకారం రిజిస్ట్రేషన్ చేసి విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు ఉత్తర మండల డీసీపీ సాధనరష్మీ పెరుమాళ్ తెలిపారు. బోయినపల్లికి చెందిన కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒక ముఠాగా ఏర్పడి పాత రిజిస్ట్రేషన్ చేసిన భూములను నకిలీ పత్రాలతో కాజేయాలని కుట్రపన్నినట్లు తెలిపారు. కృష్ణారావు 1982లో భూమిని కొనుగోలు చేసినట్లు, అప్పట్లో రిజిస్ట్రేషన్ కోసం ఫోటోలు బయోమెట్రిక్ విధానం లేకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది భూకబ్జాదారుల ముఠా కృష్ణారావు ఖాళీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకొని అమ్మేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. కృష్ణారావు పేరుతో ఉబేద్‌బిన్ మహ్మద్ అనే వ్యక్తి ఆధార్ కార్డును ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. కేసులో నిందితులుగా ఉన్న రవూఫ్ పాషా, సాయినాథ్, అబిద్ అహ్మద్, షేక్ అమీద్, భీమ్‌సింగ్‌లు ముఠాగా ఏర్పడి వారే రిజిస్ట్రేషన్ చేయించుకుని విక్రయించేందుకు ప్రణాళిక వేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు అక్రమంగా తయారు చేయించిన రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో భూకబ్జాలకు పాల్పడుతూ సీనియర్ సిటిజన్స్ రిటైర్డ్ ఆర్మీకి చెందినవారి భూములను కాజేసినందుకు ప్రయత్నిస్తున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ రమేష్, కార్ఖానా ఇన్‌స్పెక్టర్ వి.రామకృష్ణ, ఎస్సై రవికుమార్‌లు పాల్గొన్నారు.



పద్మారావునగర్‌లో ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

ఆటోడ్రైవర్లు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

పద్మారావునగర్, బౌద్ధనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీ.హెచ్.శ్రీనివాసులు కోరారు. బుధవారం పద్మారావునగర్‌లో ఆటోడ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్‌ను ధరించాలని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని కోరారు.



గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో కళల ప్రదర్శనకు సిద్ధమైన విద్యార్థులు




చిత్ర కళలో నైపుణ్యం పొందిన విద్యార్థులు వేసిన చిత్రాల ముందు కళాశాల ప్రతినిధులు చక్రవర్తి వినయ్‌కుమార్, జనార్దన్, ప్రిన్సిపల్ చారుమతి, ఆహ్వానితులు రవిశంకర్, విద్యార్థినులు ఉన్నారు

ఆకట్టుకున్న ఆర్ట్ గ్యాలరీ

● 17న మారేడుపల్లి కస్తూర్బా జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు



భారతదేశ చిత్రపటాన్ని వేస్తున్న విద్యార్థినులు



వాల్ పేయింటింగ్



విద్యుత్ లైటింగ్‌తో కళకళలాడుతున్న కళాశాల

మారేడుపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి కస్తూర్బా గాంధీ మహిళా జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని కళాశాలలో నిర్వహిస్తున్న ఆర్ట్ గ్యాలరీ ఆకట్టుకుంటోంది. ఈనెల 17న గోల్డెన్ జూబ్లీ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మారేడుపల్లి కస్తూర్బా జూనియర్ కళాశాలను ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 1973లో మూడెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. 175 మంది విద్యార్థులతో కళాశాల ప్రారంభమైంది. నేడు ఇదే కళాశాలలో 1,200 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ చదుకున్న విద్యార్థినులు ప్రస్తుతం ఉన్నతమైన హోదాల్లో ఉన్నారు. భారతక్రికెట్ మహిళాజట్టుకు ప్రాతినిధ్యం వహించిన మిథాలీ రాజ్ ఇదే కళాశాలలో చదువుకున్నారు.

కళాశాల గోడలకు చిత్రకళానైపుణ్యం

కళాశాల ఆవరణలో ప్రహరీ గోడలకు ఇక్కడ చదువుతున్న విద్యార్థినులు విభిన్నమైన చిత్రాలను వేసి ఔరా అనిపిస్తున్నారు.

చిత్రకళలో నైపుణ్యం పొందిన విద్యార్థినులు కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞాన పరికరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, భారతదేశ భక్తి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన విభిన్నమైన చిత్రాలను వేసి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు.

పాత నాణేలు, కరెన్సీ సేకరణ అతడి హాబీ



పాత నాణేలు (ఇన్‌సెట్‌లో వేణుగోపాల్)

మారేడుపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్నేహితునికి పుట్టిన రోజు సందర్భంగా గిఫ్ట్ ఇవ్వాలనుకుంటున్నారా.... అయితే అతని పుట్టినరోజు సంవత్సరానికి సంబంధించిన రూపాయి నోటును బహుమతిగా ఇస్తే ఎలా ఉంటుంది.

వివరాల్లోకి వెళితే మారేడుపల్లి కృష్ణపురి కాలనీకి చెందిన వేణుగోపాల్ (85) అనే వృద్ధుడు గత కొన్ని ఏళ్లుగా కాయిన్స్ ఎగ్జిబిషన్‌లోనే కాకుండా దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి పూర్వకాలం నాటి పాత అరుదైన నాణాలను రూపాయలను సేకరించడం అలవాటుగా మారింది. 1948 సంవత్సరా కాలం నాటి నయా పైసాతో కూడిన నాణేలతో పాటు రాగి. పంచలోహాలు, ఇత్తడి, తదితర నమూనాలు ఇతని వద్ద దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా రూపాయి నోటు మొదలుకొని ప్రస్తుతం కొనసాగుతున్న నోట్లు సైతం ఇతని వద్ద ఉండడం గమనార్హం. ఈస్ట్ ఇండియా, బ్రిటీష్ ఇండియా, విజయనగరం, మొగుల్ చక్రవర్తులు, నిజాం కాలం నాటి నాణాలను సేకరించి ఆసక్తి కలిగిన వారికి అమ్ముతున్నాడు. కార్ఖానా ప్రధాన రహదారిలో గల సుధాకర్ టిఫిన్ సెంటర్ వద్ద అతను సేకరించే నాణేలను అమ్ముతూ సంతోషం వ్యక్తం చేశారు. ఎలాంటి విలువ గల నోటు కావాలన్నా ఇస్తాడు. దీంతో నాణాలను చూసిన వారందరూ చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు.

అదేవిధంగా పుట్టిన సంవత్సరం ఒక రూపాయి నోటు దొరకాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో కష్టతరమైనప్పటికీ ఇతని వద్ద ఈజీగానే లభిస్తుంది. ఇలా అరుదైన నాణాలు, పాత రూపాయలు తీసుకోవాలనుకున్నవారు కోరినంత డబ్బు ఇచ్చి నాణేలను ఇతని వద్ద నుంచి తీసుకుంటారు. ఇష్టమైనవారికి నాణాలను అమ్మడం వారి సంతోషానికి అనుభూతి కలిగిస్తుందని బుధవారం ఆంధ్రజ్యోతి విలేకరితో వివరాలు వెల్లడిస్తూ ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మీకు అవసరమనుకుంటే 799589922 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

● హాజరైన పలువురు ఇస్రో శాస్త్రవేత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త డా. పి.శ్రీలత తదితరులు

తార్నాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇస్రో శాస్త్రవేత్తలు డా.పి.శ్రీలత, పి.ప్రదీప్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఇస్రో శాస్త్రవేత్తలు డా.పి.శ్రీలత, పి.ప్రదీప్ కుమార్ భారత అంతరిక్ష పరిశోధనలో చేసిన సేవలను గుర్తిస్తూ తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ తరుపున డా.విక్రమ్ సారాభాయ్ స్మారక అవార్డు 2024ను అందించారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలు డా. పి.శ్రీలత, పి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి తీరుతెన్నులను విద్యార్థులకు వివరించారు. చంద్రునిపై నీటిని కనుగొనడం, చంద్రుని దక్షిణ ధృవంపై మొదటి ల్యాండింగ్, మార్స్ మిషన్ల వంటి విజయాలను విద్యార్థులతో పంచుకున్నారు. కళాశాల స్థాయి నుండే విద్యార్థులు విమర్శనాత్మకంగా ఆలోచించేవిధంగా ప్రొఫెసర్లు ప్రోత్సహించాలని, భవిష్యత్‌లో ఇస్రోలో జరిగే పరిశోధనల్లో విద్యార్థులు భాగస్వామ్యం అయ్యేందుకు ఉన్న అవకాశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్, కన్వీనర్ పి.నవీన్ కుమార్, మాజీ ఐఏఎస్ ఆఫీసర్ అశోక్, సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఈ. గట్టయ్య పాల్గొన్నారు.



సర్కిల్ 9 అసిస్టెంట్ పౌరసరఫరా అధికారి కల్యాణ్‌తో సమావేశమైన కార్పొరేటర్ సామల హేమ

రేషన్‌కార్డుదారుల సమస్యలను పరిష్కారించాలి

కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో రేషన్‌కార్డులదారుల సమస్యలను పరిష్కారించాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సర్కిల్-9 అసిస్టెంట్ పౌరసరఫరా అధికారి కల్యాణ్‌తో కార్పొరేటర్ సమావేశమయ్యారు. నూతన రేషన్‌కార్డుల వివరాలను అడుగగా ప్రభుత్వం నుంచి విధివిధానాలు వెల్లడించలేదని, కుటుంబసభ్యులను చేర్చుకోవటానికి మాత్రమే ఆప్షన్ ఉందని తెలిపారు.



జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి బుధవారం జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపుతున్న రైల్వే డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది

డాక్టర్లకు రక్షణ కల్పించాలి

● రైల్వే డాక్టర్లు

చిలకలగూడ, ఆగస్ట్ 14 (ఆంధ్రజ్యోతి): కలకత్తా, ప్రభుత్వ వైద్య కళాశాలలో విధినిర్వహణలో వున్న వైద్యురాలిని కిరాతకంగా హత్య చేయడాన్ని ఖండిస్తు రైల్వే డాక్టర్లు నల్ల బ్యాడ్జిలు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. బుధవారం లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది మాట్లాడుతు నిందితుడిని కఠినంగా శిక్షించాలని, విధినిర్వహణలో వున్న డాక్టర్లకి భద్రతకల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు. ఎస్.వి. బి.కె.సాయి, పద్మ, కృష్ణవేణి, రమేష్, వేదారణ్య నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



7వ వార్డ్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రుక్మయ్య బుధవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును కలిసి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఎస్సై రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి

ఘనంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పెద్ది రవీందర్ తదితరులు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ మహాకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. దాదాపు 800 మంది విద్యార్థులు, యువకులు పాల్గొన్న ఈ తిరంగా ర్యాలీ ఆద్యంతం భారత్ మాతాకీ జై..వందే మాతరం... ఘర్ ఘర్ తిరంగల నినాదాలతో ఆయా ప్రాంతాలు హోరెత్తిపోయాయి. పీజీ రోడ్డులోని మమత స్వీట్ హౌస్ నుంచి మొదలై మెక్లోడ్‌గూడ, నల్లగుట్ట సీ లైన్, జే లైన్, రాంగోపాల్‌పేట్, కేఎఫ్‌సీల మీదుగా సాగి ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జాతీయ గీతాలాపనతో ర్యాలీ ముగించారు. ఈ సందర్భంగా పెద్ది రవీందర్ మాట్లాడుతూ.... ఘర్ ఘర్ తిరంగా.... హర్ ఘర్ తిరంగా అని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ ర్యాలీని నిర్వహించడం జరిగిందని, ఈ ర్యాలీ రాజకీయపరంగా చేసినది కాదని, ప్రజల్లో జాతీయభావాన్ని పెంపొందించేందుకు చేసిన చిన్న కృషి అన్నారు. ర్యాలీలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రవణ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి జె.సంతోష్, లింగ్విస్టిక్ మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మిథున్ జైన్, కోశాధికారి గౌరవ్ దాగాలతో పాటు పలు కళాశాలల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

వారాసిగూడలో జాతీయజెండాల పంపిణీ

బౌద్ధనగర్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆజాదిక అమృత మహోత్సవంలో భాగంగా బుధవారం వారాసిగూడలో బీజేపీ నాయకులు ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అనంతరం పలు ఇళ్లపై జాతీయజెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పి.స్వరూపగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, నాయకులు అజయ్‌నాయుడు, సతీష్‌రాజ్, వేణుగోపాలచారి, సంపత్, లక్ష్మణ్, సింహాలు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలు శుభ్రం చేసిన కార్పొరేటర్

రెజిమెంటల్‌బజార్ : హర్ ఘర్ తిరంగా అభ్యాన్ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను కార్పొరేటర్ కొంతం దీపిక ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద శుభ్రం చేసి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కొంతం నరేష్, రామక్రిష్ణ, నాగేష్, వీరవర్ధన్, వాసు, రాజేష్, నరేందర్, సురేష్, వెంకట్, మదన్, విశాలిని తదితరులు పాల్గొన్నారు.



వారాసిగూడలో జాతీయజెండాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు